## క్లుప్తంగా

### నవయుగ యూత్ కమిటీ ఎన్నిక



యూత్ అసోసియేషన్ సభ్యులు

**మీర్‌పేట:** మీర్‌పేట కార్పొరేషన్ జిల్లెలగూడ నవయుగ యూత్ అసోసియేషన్ నూతన కమిటీని ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా సిద్దాల కృష్ణ, సభ్యులుగా పోరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సిద్దాల బాలప్ప, సిద్దాల శ్రీశైలం, కేమాద్రి, అర్కల కాశీ, దామోదర్‌రెడ్డిలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ.. రానున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు.

### ఆ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

**మొయినాబాద్:** విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతూ.. వారిని మోసం చేసిన భాస్కర మెడికల్ కళాశాల, నైటింగేల్ నర్సింగ్ కళాశాలలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎస్ఎఫ్ఐ చేవెళ్ల డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్, అరుణ్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం మొయినాబాద్‌లో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. నైటింగేల్ నర్సింగ్ కళాశాలలో మూడేళ్ల క్రితం సుమారు 50 మంది విద్యార్థులు జీఎన్ఎం కోర్సులో చేరారన్నారు. వారిని భాస్కర మెడికల్ కళాశాల ఆస్పత్రికి పంపి మూడేళ్లుగా వారితో వెట్టిచాకిరి చేయించారన్నారు. మూడేళ్లుగా వారికి ఎలాంటి క్లాసులు చెప్పకుండా, పరీక్షలు నిర్వహించలేదని.. జీతభత్యాలు, స్కాలర్‌షిప్‌లు ఇవ్వకుండా ఆస్పత్రిలో పని చేయించారన్నారు. ప్రభుత్వ ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవడం కోసం విద్యార్థులు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వాలని కళాశాల ప్రిన్సిపాల్‌ను అడిగితే రూ.3లక్షల ఫీజు చెల్లించాలని డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. క్లాసులు నిర్వహించకుండా వెట్టిచాకిరి చేయించుకొని విద్యార్థులను మోసం చేసిన నైటింగేల్ నర్సింగ్ కళాశాల, భాస్కర మెడికల్ కళాశాలలపై ప్రభుత్వం క్రిమినల్ కేసులు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేదంటే ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాలల ముందు ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

### ఉద్యోగులకు విరమణ సహజం

**రిటైర్డ్ సబ్ రిజిస్ట్రార్ రాజేంద్రకుమార్**

**చేవెళ్ల:** ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు, రిటైర్‌మెంట్‌లు అనేవి సహజంగా జరుగుతుండేవేనని రిటైర్డ్ సబ్ రిజిస్ట్రార్ రాజేంద్రకుమార్, చేవెళ్ల నుంచి బదిలీ అయిన ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ విష్ణుగౌడ్‌లు అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం వీరయ్య గార్డెన్‌లో చేవెళ్ల నుంచి బదిలీ అయిన ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్, సీనియర్ అసిస్టెంట్ విష్ణుగౌడ్, జూనియర్ అసిస్టెంట్‌లు దేవిక, ప్రసన్న, అటెండర్ కల్యాణిలు, గతంలో చేవెళ్లలో పనిచేసి రిటైర్ అయిన రాజేంద్రకుమార్‌లకు వీడ్కోలు, కొత్తగా చేవెళ్లకు వచ్చిన సీనియర్ అసిస్టెంట్, ఇన్‌చార్జి సబ్ రిజిస్ట్రార్ శ్రీనివాసులు, జూనియర్ అసిస్టెంట్ నయిమోద్దీన్‌లకు స్వాగత కార్యక్రమం నిర్వహించారు. చేవెళ్లలోని డాక్యుమెంట్ రైటర్ల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారికి ఘనంగా సన్మానాలు చేశారు. చేవెళ్లలో తాను ఎక్కువ కాలం పనిచేసే అవకాశం లభించిందన్నారు. తనకు సహకరించిన తోటి ఉద్యోగులకు, సిబ్బంది, డాక్యుమెంట్ రైటర్లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కొత్తగా వచ్చిన అధికారికి కూడా అదేవిధంగా పూర్తి సహకారం అందించాలని కోరా రు. కార్యక్రమంలో డ్యాకుమెంట్ రైటర్ల సంఘం నాయకులు నర్సింహారెడ్డి, రాంచంద్రయ్య, బుచ్చిలింగం, విఠల్‌దాస్, దయాకర్‌రెడ్డి, మల్లేశ్, ప్రభు, రాములు, శివ, జగదీశ్వర్‌రెడ్డి, శ్రీరాములు, గోపి, మోబిన్, మహేందర్, యాదగిరి ఉన్నారు.

### ఆపదలో అండగా..



బాధిత కుటుంబ సభ్యులకు చెక్కు అందిస్తున్న పల్లె బ్రదర్స్

**కేశంపేట:** మండల పరిధిలోని కొండారెడ్డిపల్లి గ్రామంలో శనివారం రాత్రి బైండ్ల లింగం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడిది నిరుపేద కుటుంబం కావడంతో ఆదివారం గ్రామానికి చెందిన పల్లె బ్రదర్స్ అయిన పల్లె ఆనంద్‌కుమార్, బాలీశ్వర్‌లు లక్ష రూపాయల ఆర్థికసాయం అందించారు. ఈ నగదు మొత్తాన్ని ఆడపిల్లల అవసరాల కోసం పేర్ల పైన బ్యాంక్‌లో ఫిక్స్‌డ్ డిపాజిట్ చేస్తామని వారు తెలిపారు. కార్యక్రమంలో విజేందర్‌రెడ్డి, సూరం శ్రీనివాస్, శివకుమార్, మల్లేశ్‌గౌడ్, కరుణాకర్‌రెడ్డి, శ్రీశైలం, మల్లేశ్, రమేశ్, శ్రీను, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

# నేడు స్వచ్ఛదనం-పచ్చదనం

- ఐదురోజుల పాటు గ్రామాల్లో కార్యక్రమాలు
- పచ్చదనం పెంపునకు ప్రభుత్వం చర్యలు
- అందరూ భాగస్వాములు కావాలని అధికారుల పిలుపు



మహేశ్వరంలో నర్సరీలో మొక్కలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ శైలజ, అధికారులు

**మహేశ్వరం:** గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పరిశుభ్రత, పచ్చదనాన్ని పెంచి ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు తెలంగాణ ప్రభుత్వం- స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని ఈ నెల 5(నేటి) నుంచి 9వ తేదీ శుక్రవారం వరకు నిర్వహించనుంది. ఉన్నతాధికారుల నుంచి మండల, డివిజన్ స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేసి గ్రూపులుగా ఏర్పాటు చేసి సలహాలు, సూచనలు అందజేశారు.

**వీటిపైనే ప్రధాన దృష్టి.**

వర్షాకాలం కావడంతో పారిశుద్ధ్యం అధ్వానంగా మారుతోంది. గ్రామాలు, పట్టణాల్లో మురుగు నీటి వ్యవస్థ గాడితప్పుతోంది. దోమలు, ఈగలు విజృంభించి ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఈ వర్షాకాలంలో రోడ్లు, ఖాళీ ప్రదేశాలు శుభ్రం, రోడ్డు కిరువైపులా పిచ్చిచెట్ల తొలగింపు, మురుగు కాల్వలు, చెత్త కుప్పలు శుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్ చల్లడం. ఐదురోజుల పాటు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాల్లో ప్రతిఒక్కరూ భాగస్వాములై విజయవంతం చేయాలని అధికారులు కోరుతున్నారు.

**మొదటి రోజు**

నాయకులు, స్వయం సహాయక సంఘాలు, యువజన సంఘం, గ్రామ సంఘం సభ్యులతో సమావేశం నిర్వహించి ర్యాలీలు చేపట్టాలి. ఇంటిస్థాయిలో చెత్తను వేరు చేయడంపై అవగాహన కల్పించాలి. ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తను సేకరించడం ద్వారా కంపోస్టును ఉత్పత్తిచేయాలి. పాఠశాలలో పారిశుద్ధ్యం, మొక్కల పెంపకం, వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్లాస్టిక్ వాడకంతో కలిగే దుష్పరిణామాలు పలు అంశాలపై ప్రసంగం, వ్యాసరచన పోటీలు నిర్వహించాలి. గ్రామాలు, పట్టణాల్లో ప్రతిరోజు వీధులు, బహిరంగ ప్రదేశాలను శుభ్రం చేయాలి. అన్ని ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, అంగన్‌వాడీలు, హాస్టళ్లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్టాప్‌లు శుభ్రం చేయాలి.

**రెండో రోజు**

అన్ని తాగునీటి వనరులను శుభ్రం చేసి, క్లోరినేషన్ చేయాలి. దూర నివాస ప్రాంతాలు,, బలహీన వర్గాల కాలనీలను సందర్శించి అక్కడ తాగునీటి పరిస్థితిని గుర్తించాలి. గ్రామాల్లో యాంటీ లార్వా రసాయనాలు పిచికారీ చేయాలి. దోమల నివారణకు ఫాగింగ్(మలాథియాన్) ప్రతి రోజు చేయాలి. పశుసంవర్ధక శాఖ, పంచాయతీ కార్యదర్శుల సమన్వయంతో కుక్కల సర్వే చేపట్టాలి.

**మూడో రోజు**

గ్రామాల్లో అన్నీ మురుగు కాల్వల్లో చెత్త నిర్మూలన చేపట్టాలి. సాధ్యమైనంత వరకు ఎక్కడిదక్కడ నిలిచిపోయిన నీటిని బయటకు పంపాలి. మొరంతో గుంతలను పూడ్చడం, రోలింగ్ ద్వారా రహదారికి మరమ్మతులు చేయాలి. నిలకడగా ఉన్న నీటిని బయటకు పంపడం సాధ్యం కానీ ప్రదేశాలలో ట్యాంకులు, హ్యాండ్ పంపులు దగ్గర సోక్‌పిట్‌లను డ్రెయిన్ ఎండ్ పాయింట్‌ల వద్ద ఏర్పాటు చేయాలి. ప్రభుత్వ సంస్థలు, భవనాలను ప్రభుత్వ స్థలాలను శుభ్రం చేయాలి.

**నాలుగో రోజు**

పాఠశాల సమావేశాల్లో డెంగీ, మలేరియాపై అవగాహన సదస్సులు నిర్వహించాలి. ఆరోగ్య కార్యకర్తలతో సమన్వయం చేసుకుంటూ సీజనల్ వ్యాధుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలి. గ్రామాల్లో వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు జ్వర సర్వేను నిర్వహించాలి. ఏదైనా ప్రాంతాల్లో జ్వరాలు ఉంటే ఆ ప్రాంతంలో ఇంటెన్సివ్ క్లీనింగ్, యాంటి లార్వా, ఫాగింగ్ కార్యకలాపాలు చేపట్టాలి. దోమల వృద్ధిని నిరోధించడానికి ఆయిల్ బాల్‌ను తగిన సంఖ్యలో తయారుచేసి నిలిచి ఉన్న నీటి ప్రాంతాల్లో వదలాలి. గుర్తించిన ప్రదేశాల్లో అవెన్యూ ప్లాంటేషన్లు ఏర్పాటు చేయాలి. గ్రామ పంచాయతీలలో ఉన్న పార్కులను శుభ్రం చేయాలి.

**ఐదో రోజు**

గ్రామాల్లో ఇళ్ల చుట్టూ పక్క నిలిచిన నీటిన్నింటిని తొలగించాలి. శుక్రవారం డ్రై డేగా పాటించాలి. అన్ని ఇళ్లను శుభ్రం చేసి ఉపయోగించిన వస్తువులను తీసివేయాలి. అన్ని కార్యాలయాలు డ్రై డేగా పాటించి టీ కప్పులు, షూలు, సీసాలు, టైర్లు, కంటైనర్లు వంటి వస్తువులను తొలగించాలి. అన్ని ప్రభుత్వ సంస్థలు, పాఠశాలలు, అంగన్‌వాడీ, హాస్టల్‌లు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, బస్టాప్‌లు, ఆట స్థలాల పైకప్పులను శుభ్రం చేయాలి. శిథిలమైన భవనాలను తొలగించాలి.

**ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి**



నేటి 5 నుంచి 9వ తేదీవరకు గ్రామ పంచాయతీల్లో జరుగుతున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాల్లో ప్రజలు భాగస్వాములై విజయవంతం చేయాలి. ఇప్పటి వరకు ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాలను గ్రామ ప్రత్యేకాధికారులు, పంచాయతీ కార్యదర్శులకు పంపించాం. ఐదురోజుల పాటు ఒక్కో రోజు ఒక కార్యక్రమం నిర్వహించాలి.

– శైలజ, ఎంపీడీఓ, మహేశ్వరం

# సర్వీస్ రోడ్డులో వ్యర్థాలు

- దుర్వాసనతో ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు



తుక్కుగూడ ఔటర్ సర్వీస్ రోడ్డులో ఉన్న వ్యర్థాల సంచులు

**తుక్కుగూడ:** నెహ్రూ ఔటర్ రింగు సర్వీస్ రోడ్డంతా పూర్తిగా వ్యర్థాలతో నిండిపోతోంది. తుక్కుగూడ ఔటర్ ఎగ్జిట్ 14 నుంచి రావిర్యాల ఎగ్జిట్ 13 వరకు సర్వీస్ రోడ్డులో ఏటు చూసినా వ్యర్థ పదార్థాల సంచులు దర్శనమిస్తున్నాయి. నగరంలోని పలు ప్రాంతాలకు చెందిన హోటల్, మాంసం, చికెన్, తదితర షాపుల విక్రయదారులు వ్యర్థాలను తీసుకొచ్చి రాత్రి సమయంలో గుట్టుగా ఇక్కడ పడేస్తున్నారు. రోజురోజుకు రోడ్డంతా దుర్వాసన వ్యాపించడంతో వాహనదారులు, పాదాచారులు ఇక్కడి ప్రయాణం చేయడానికి ఇబ్బంది పడుతున్నారు. జంతు కళేబరాల వ్యర్థాల కోసం వీధి కుక్కలు ఇక్కడికి క్యూ కడుతున్నాయి. సర్వీస్ రోడ్డులో కుక్కలు గుంపులు, గుంపులుగా తిరగడంతో ప్రయాణికులు జంకుతున్నారు. ఇప్పటికైనా సర్వీస్ రోడ్డు నిర్వాహకులైన హెచ్ఎండీఏ అధికారులు స్పందించి, వేసిన వ్యర్థాలను తీసివేయడంతో పాటు వాటిని వేయకుండా తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

# అడ్డగోలు పార్కింగ్!

- రాకపోకలకు ఇబ్బందులు
- పట్టించుకోని అధికారులు



జల్‌పల్లి కార్గో రోడ్డులో లారీల అక్రమ పార్కింగ్

**పహాడీషరీఫ్:** జల్‌పల్లి మున్సిపాలిటీలోని ప్రధాన రహదారులపై వాహనాల అక్రమ పార్కింగ్‌తో ప్రమాదాలు పొంచి ఉన్నాయి. జల్‌పల్లి కార్గో రోడ్డులో ఇసుక లారీలను వాంబే కాలనీ ఎదురు రోడ్డులో హోటల్ పక్కన లారీలు యథేచ్ఛగా పార్కు చేస్తున్నారు. దీనికి కొద్ది దూరంలోని ముత్యాలమ్మ ఆలయం వెనుక వైపు సైతం దుకాణాల వద్ద కూడా రోడ్డుపైనే పార్కు చేస్తున్నారు. నిత్యం పెద్దఎత్తున వాహనాల రాకపోకలు సాగే ఈ రహదారిపై ఇలా ఇష్టానుసారంగా పార్కింగ్ చేస్తుండడంతో రోడ్డు కుచించుకుపోయి ప్రమాదాలు జరుగుతున్నాయి. పహాడీషరీఫ్ బైపాస్ రోడ్డులోనూ సైతం లారీలను పార్కింగ్ చేస్తుండడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇక్కడ ఉన్న పెట్రోల్ బంక్‌కు గ్యాస్ ఫిల్లింగ్ కోసం వచ్చే కార్లు సైతం పదుల సంఖ్యలో రోడ్లపైనే క్యూ కడుతున్నాయి. జల్‌పల్లి కమాన్ వద్ద సిమెంట్ లారీలు, షాహిన్‌నగర్, ఎర్రకుంటలలో ఇలాగే వాహనాలను అడ్డదిడ్డంగా పార్కు చేస్తుండడం శ్రీశైలం హైవేపై వెళ్లే ఇతర వాహనదారులకు అసౌకర్యంగా మారుతోంది. ఈ విషయంలో పోలీసు అధికారులు స్పందించి అక్రమ పార్కింగ్‌కు చెక్ పెట్టాలని కోరుతున్నారు.

# అమెరికాలో సీఎంను కలిసిన కిరణ్‌రెడ్డి

**కడ్తాల్:** అమెరికా పర్యటనలో ఉన్న సీఎం రేవంత్‌రెడ్డిని, కడ్తాల్ మండల కేంద్రానికి చెందిన ప్రవాస భారతీయుడు, తానా కోఆర్డినేటర్ గూడూరు కిరణ్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కడ్తాల్ సమీపంలోని కందుకూర్ మండలంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ, ముచ్చర్ల ప్రాంతాన్ని ఫ్యూచర్ సిటీగా అభివృద్ధి చేస్తామని ప్రకటించినందుకు ఆయన సీఎంకు కృతజ్ఞతలు తెలిపారు. ముచ్చర్లలో ఫ్యూచర్ సిటీ ఏర్పాటుతో కడ్తాల్ మండ లం వేగంగా అభివృద్ధి చెందనుందని, దశదిశ మారనున్నట్లు పేర్కొన్నారు. సొంత గ్రామాలను అభివృద్ధి చేసుకోవడానికి అమెరికాలో స్థిరపడిన ప్రవాస భారతీయులందరూ, రాజకీయాలకతీతంగా, పార్టీలకతీతంగా తమ వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడు అందజేస్తామని ఈ సందర్భంగా కిరణ్ రెడ్డి తెలిపారు.

# కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ నాయకులు

**కందుకూరు:** బీఆర్ఎస్ మండల సీనియర్ నాయకులు స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మాజీ సీఎం కేసీఆర్‌ను ఎర్రవెల్లిలోని ఫాంహౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేసీఆర్ వారికి భరోసా కల్పించారు. రాబోయే రోజుల్లో తమ ప్రభుత్వమే మళ్లీ అధికారంలోకి వస్తుందని చెప్పారు. అందరూ కష్టపడి పార్టీ బలోపేతానికి పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మన్నే జయేందర్‌ముదిరాజ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఎస్.సురేందర్‌రెడ్డి, పార్టీ నియోజకవర్గం ఉపాధ్యక్షుడు జి.లక్ష్మీనర్సింహారెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ డి.చంద్రశేఖర్, మాజీ సర్పంచులు జ్యోతిశేఖర్, గోపాల్‌రెడ్డి, భూపాల్‌రెడ్డి, సీనియర్ నాయకులు మేఘనాథ్‌రెడ్డి, ఆర్.ప్రభాకర్‌రెడ్డి, ఆనంద్, దర్శన్‌రెడ్డి, వెంకటేష్, దేవులానాయక్, రాములు తదితరులు పాల్గొన్నారు.

## రక్తదాన శిబిరానికి విశేషస్పందన

**ఆమనగల్లు:** ఆమనగల్లు లయన్స్‌క్లబ్, ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో కల్వకుర్తి పట్టణంలో ఆదివారం నిర్వహించిన రక్తదానం శిబిరానికి విశేషస్పందన వచ్చింది. ఈ శిబిరాన్ని ఉప్పల చారిటబుల్ ట్రస్టు చైర్మన్ ఉప్పల వెంకటేశ్‌తో కలిసి లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు పసుల లక్ష్మారెడ్డి ప్రారంభించారు. ఈ శిబిరంలో 72 మంది రక్తదానం చేశారు. అనంతరం వారు మాట్లాడారు. రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని కోరారు. లయన్స్‌క్లబ్ జిల్లా చైర్మన్ జూలూరి రమేశ్, పీఆర్ఓ పాషా, సభ్యులు వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## రోడ్డు విస్తరణపై దృష్టి పెట్టండి

**యాచారం:** కందుకూర్-యాచారం గ్రామాల మధ్య వంద అడుగుల రోడ్డు విస్తరణకు రోడ్డు భవనాల శాఖ అధికారులు దృష్టి సారించాలని బీఎస్ఆర్ ట్రస్ట్ చైర్మన్ బిలకంటి చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. గత బీఆర్ఎస్ సర్కార్ హయాంలోనే రోడ్డు విస్తరణకు నిధులు మంజూరైందని, అప్పట్లోనే అధికారుల నిర్లక్ష్యం వల్ల పనులు ముందుకు సాగలేదని తెలిపారు. ప్రస్తుతం ఉన్న అధికారులు త్వరలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని కోరారు. రోడ్డు విస్తరణ విషయమై ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిని కోరినట్లు పేర్కొన్నారు.



తమ్మలోనిగూడ గేట్ వద్ద మొక్కలు నాటి మట్టి నింపని గుంతలు

# నాటారు.. వదిలేశారు..!

**ఎండిపోతున్న మొక్కలు**

- పూడ్చని గుంతలు
- పట్టించుకోని అధికారులు

**యాచారం:** అధికారుల నిర్లక్ష్యంతో నాటిన మొక్కలు ఎండిపోతున్నాయి. రూ. లక్షలు ఖర్చు చేసి నర్సరీల్లో మొక్కలు పెంచి నాటాలనే లక్ష్యానికి అధికారులు గండికొడుతున్నారు. గుంతలు తీయించేవరకే పర్యవేక్షణ. తదనంతరం మొక్కలు నాటారా? లేదా? అనే విషయాలను పట్టించుకోవడం లేదు. పక్షం రోజుల కింద ఎడతెరిపి లేకుండా వర్షాలు కురియడంతో యాచారం మండల పరిధిలోని తమ్మలోనిగూడ గ్రామ పరిధి సాగర్‌రోడ్డుకు ఇరువైపులా ఈజీఎస్ సిబ్బంది 500 గుంతలు తీశారు. వాటిలో మొక్కలు నాటారు. కానీ మొక్కలు నాటిన గుంతల్లో మట్టి పూడ్చకుండా వదిలేశారు. దీంతో ఆ మొక్కలు కొన్ని ఎండిపోయాయి. వీటి కోసం ఉపాధి కూలీలు మొక్కలు నాటినట్లు వారికి డబ్బులు చెల్లించేటట్లు రికార్డుల్లో నమోదు చేశారు. కాని 500కు పైగా గుంతల్లో నాటిన మొక్కలు అలానే ఉన్నాయి. అవి ఎండిపోతున్నాయి. ఈ విషయమై గ్రామస్తులు అధికారులను పలుమార్లు ఫిర్యాదులు చేసినా పట్టించుకునే వారే కరువైయ్యారు. కనీసం పర్యవేక్షణ చేయడానికి అధికారులు కృషి చేయకపోవడం బాధాకరం అని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



చెక్కు అందజేస్తున్న శ్రీనివాస్‌రెడ్డి

**ఆమనగల్లు:** నిరుపేదల ఆరోగ్య పరిరక్షణకు సీఎంఆర్ఎఫ్ వరమని రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. నారాయణపూర్ గ్రామానికి చెందిన తారాసింగ్‌నాయక్ అనారోగ్యానికి గురయ్యారు. ఈ విషయాన్నిగోలి శ్రీనివాస్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన సీఎం సహాయనిధికి దరఖాస్తు చేయించారు. దీంతో మంజూరైన రూ.16,500 చెక్కును ఆమనగల్లు పట్టణంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో తారాసింగ్‌నాయక్‌కుఅందజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ నాగులు నాయక్,తలకొండపల్లిమండలటీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ చంద్రశేఖర్‌రెడ్డి,సతీష్, సుమన్, గురువయ్య, శ్రీను, గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



## ఆర్థిక సహాయం

**తలకొండపల్లి:** మండల పరిధిలోని సంగాయిపల్లికి చెందిన బలరాం అనారోగ్యంతో శనివారం రాత్రి మృతిచెందాడు. ఆదివారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతి వ్యక్తం చేశారు. రూ.3000 ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జనార్దన్‌రెడ్డి, శ్రీను, వినోద్, రాములు, వెంకటయ్య, తదితరులు పాల్గొన్నారు.

## ఎస్సీ వర్గీకరణపై సంబరాలు

**షాబాద్:** ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ఆహ్వానిస్తున్నామని స్థానిక అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు సతీశ్, ఎమ్మార్పీఎస్ నాయకుడు విశ్వంమాదిగ, బీసీ సేన జాతీయ అధ్యక్షుడు కృష్ణయాదవ్ పేర్కొన్నారు. ఆదివారం మండల కేంద్రంలో అంబేడ్కర్, బాబూ జగ్జీవన్ రామ్ విగ్రహాలకు పూలమాలలు వేశారు. అనంతరం ప్రధాని మోదీ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చిత్రపటాలకు మాజీ జెడ్పీటీసీ లక్ష్మీరాజేందర్‌గౌడ్, బీజేపీ మండల అధ్యక్షుడు కిరణ్‌లతో కలిసి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో కృష్ణ, రాములు, బాల్‌రాజ్, రమేశ్‌యాదవ్, అంతయ్య, రాజేందర్ పాల్గొన్నారు.



ప్రధాని, మంద కృష్ణ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



ప్రవచనాలు చేస్తున్న గురూజీ అనిల్‌కుమార్‌జోషి



కొనసాగుతున్న హోమం

# ఘనంగా అమావాస్య హోమం

**కందుకూరు:** మండలంలోని పులిమామిడి పరిధిలోని శ్రీనిఖిల్ చేతనా కేంద్రంలో అమావాస్యను పురస్కరించుకొని బ్రహ్మశ్రీ గురూజీ అనిల్‌కుమార్‌జోషి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా హోమం కార్యక్రమం నిర్వహించారు. హోమం పూర్తి చేసి పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం భక్తులకు గురూజీ ప్రవచనాలు చేసి ఆశీర్వాదాలతో పాటు అన్నప్రసాదం అందించారు. ఈ సందర్భంగా గురూజీ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ తమతో పాటు తమ చుట్టూ పక్కల వారి క్షేమం కూడా కాంక్షిస్తూ మెదులుకోవాలన్నారు. నిత్యం భగవంతుడి సాధనలో కొంత సమయాన్ని కేటాయిస్తే ఆటుపోట్లను తట్టుకునే మానసిక సామర్థ్యం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు పెద్దఎత్తున పాల్గొన్నారు.